# ఉభయులా బాధ్యత వహించవలసినవారే

శ్రీమతి ఎకా హనుమాయమ్మగారు

మేఘాలు దట్టంగా పట్టినవి. పెద్ద పెద్ద ఉరుములు మధ్య మధ్య మెఱుపులు. ఉరుములంటే పద్మకు ఎంతో భయం. ఉరుము ఉరిమినప్పుడల్లా తన నెత్తిమీద పడుననే పద్మ తలంచును. పద్మ గది కిటికీవద్ద కుర్చీలో కూర్చొని దొడ్డివేపు చూస్తూఉంది. నిన్న, మొన్నా కురిసిన వానకు ఇంటిచుట్టూ మోకాలులోతు నీళ్లు నిలిచియున్నవి. ఆ నీటిలో గోండ్రు కప్పలు అరుస్తున్నవి. దొడ్డిలో నేలనల్లు కొన్న గుమ్మడితీగె ఆ నీటిపై తేలియాడుతున్నది. పచ్చగావిచ్చిన గుమ్మడిపూలు పద్మాలలాగా మెరుస్తూ ఆకాశంలో మేఘాలమధ్య తొంగి తొంగి చూచే చంద్రుడ్ని వెక్కిరించుచున్నవి. పద్మ కిటికీలోనుండి ఒక్కొక్క చింతగింజ ఆ గోండ్రు కప్పలు అరచు దిక్కునకు విసరుచూ తలార్చుకొంటున్నది. పద్మ తెల్లని పట్టుచీరకట్టుకొని సాధారణ భూషణములు ధరించియున్నది. చక్కని దేహచ్ఛాయతో పద్మ మెరిసిపోతూ విచారకరమైన మొగముతో ఆమె దీర్ఘముగా నేదియో నాలోచించుచున్నది. చేతిలోనున్న పుస్తకము తెఱచి దానిలోనున్న నొక కవరు తీసినది. ప్రేమగాదండామా లేదండామా అనుకొనుచు రెండుమూడుసార్లు ఆ జాబును చదువుకొని తలపంకించినది. ఆ జాబును ముక్కలు ముక్కలుగాచేసి కిటికీలోనుండి బయటకు పారవేసినది. ఇంక జీవించ గూడదు జీవించలేను. మూడు దినాల ముచ్చట తీరిపోయినది, అని అనుకొనుచు మంచముపై పవ్వళించి దుఃఖించుచున్నది. శాంతమ్మ గదిలోకొచ్చి "అమ్మా పండుకొన్నావా? తలార్చుకో, జలుబుచేస్తుంది" అంటూ దుఃఖిస్తున్న కూతుర్ని చూచింది. "అమ్మా, దుఃఖించుచున్నావా. మంచి రోజులు వస్తవి. దుఃఖించకు" అన్నది శాంతమ్మ.

"మంచి రోజులా. ఇంక మంచి రోజులే. ఎంతగాధ! ఎంత గొడవ! మంచి రోజులు వచ్చేట్లయితే ఇలాంటి మాటలు వస్తాయా"? అన్నది పద్మ.

"అమ్మా గృహలక్ష్మిగారింటికిపోయి ఆమెతో ఈ గొడవఅంతాచెప్పి ఏంచేయమంటుందో అడుగుదాంరా, రాముడ్ని కారు తీసికొని రమ్మననా" అన్నది శాంతమ్మ.

"అయ్యో! కారా! ఆమెతో చెప్పు కొనుట యెందుకమ్మా."

"ఎందుకేమిటి! గృహలక్ష్మి ఎంతో స్త్రీ అభిమానంగలవ్యక్తి. ఆమె ఎన్నో కథలు చదివింది. పురాణాలు విన్నది. చక్కని ధర్మాలు బోధించగలదు. అందు కనే ఆమెతో చెప్పుకొంటే ఏమిచెప్పునో చూద్దాము."

"పతియే దైవమని భావించు భార్య లను బాధించి పరాభవించుచు అనరాని మాటలు అంటూ అతి మూర్ఖులుగావున్న పురుషుల గొడవలు ఏమిచెప్పుకొందుము? అమ్మా, అలా చెప్పుకొంటే మాత్రం లాభ మేమిటి?" అన్నది పద్మ.

శాంతమ్మ ఏదో చెప్పునంతలో "అక్కా" అన్న పిలుపు అవతలనుండి వినిపించింది. వెంటనే శాంతమ్మ ఈవలి కొచ్చి "ఓహో, మీరు వెయ్యేళ్ళుండి. ఇప్పుడే మీ మాటే అనుకొంటున్నాము. మీరే వచ్చారు. కూర్చోండి ఈ సోఫాలో."

గృహలక్ష్మి సోఫాలో కూర్చొని రేపు మా నాన్నగారి జన్మదినోత్సవం, కేసరి కుటీరంలోనే జరుగును. నేను పుట్టింది మొదలు మా కేసరినాన్నగారు నన్ను ఎంతో ముద్దుగాపెంచి పెద్దచేసి, పది మందికి నన్ను పరిచయంచేసి నా కీర్తి దిగంతం వ్యాపింపచేశారు. నాన్నగారికి గృహస్థ ధర్మాలంటే ఎంతో ప్రీతి. అందు కనే గృహలక్ష్మి అని నాకు నామకరణము నిడిరి. ప్రతి సంవత్సరము సువాసినీపూజ, సువర్ణకంకణ సమర్పణ మీకు తెలిసినవే గదా. మీబోటి సువాసినీలను పిలు చుటకై నేను వచ్చాను. మీరు రేపు తప్పక రావాలి" అన్నది గృహలక్ష్మి.

"అయ్యో ఎందుకురాను? అంత కన్నానా! రాధా మాధవులకథ ఎంతో రమ్యమైనకథ. మీ గృహలక్ష్మికి బహు మతిగాకూడ తెస్తాను."

"పద్మ పండుకొన్న దేమి అక్కా."

"పద్మ బ్రతుకు తెల్లవారినట్లయింది. అందుకనే మీ సలహాకు రావలెనని అను కొంటుండగా మీరే వచ్చారు."

"అదేమిటి?"

"ఏముంది, లేనిపోని నిందలు నెత్తిపై వేసి, ఈ భార్య నాకొద్దని వెళ్ళి పొయ్యాడు."

"అయ్యో, నిన్నగాక మొన్న పెండ్లి అవటము వద్దనటమా? ఏంకారణం" అన్నది గృహలక్ష్మి.

"ఏముంది. ఎన్నడు ఎరగని మాటలు. నేను, నా కూతురు మంచి వాళ్లము కామని," ఏదో చెప్పబోతూ "అక్కా ఏం చెప్పను? యింత బ్రతుకూ బ్రతికి ఈ నాటికి యిలాంటి మాటలు పడవలసి వచ్చింది. మాది సాని వృత్తిట. వ్యభి

చారముతో బ్రతుకుతున్నామని-మానహీనమైన మాటలు వినలేము, కనలేము-ఏం చెప్పను!'' అంటూ శాంతమ్మ దుఃఖించింది.

గృహలక్ష్మి నివ్వెరపోయి ''సానివృత్తియా ! ఏకుటుంబాన్ని గూర్చి ఈ మాటలు'' అంది.

''అక్కా మా కుటుంబమే - మనుష్యులనే. ఔపోసన అయిన రెండు రోజులకే పిల్లను బాధించటం మొదలు పెట్టాడు. ఎల్లప్పుడు అతనికి అత్యవసరాలే వస్తూ ఉంటవి. డబ్బు డబ్బు అని వేధిస్తూ ఉంటాడు. రెండువేలు మీ నాన్న నడిగి తెస్తావా లేదా అంటూ పద్మని ఎంతో బాధించాడుట, పద్మ చెప్పలేకపోయింది. ఒక రోజల్లా పద్మను గదిలోనుంచి ఈవలకు రానివ్వనేలేదు. కాఫీ, ఫలహారాలే లేవానాడు. రాత్రి పదిగంటలువరకూ చూచి తలుపు తట్టాను నేను. ఎవ్వరూ పలుకరు. నాకెంతో భయంవేసింది. మీ బావగారొచ్చి గట్టిగా పిల్చారు. అల్లుడు తలుపుతీసి బయటకు వెళ్లిపోయాడు. ఇల్లా చూద్దుముగదా, పద్మ కటికనేలపై పడుకొనివుంది. నేనూ ఆయనా లోపలికివెళ్లి పద్మను లేవతీసి కూర్చోపెట్టాము. వెక్కి వెక్కి ఏడుస్తూ ఎంతసేపటికీ ఏమీ చెప్పదు. ఎన్నో విధాల బ్రతిమాలంగా ''రెండువేలు నీ తండ్రి నడిగి తెస్తావా లేదా, - తెస్తేనే గది తలుపుతీయి, లేకపోతే గది తలుపుతీసి బయటకు పోవద్దు అన్నారు ఆయన'' అని చెప్పింది. అల్లుడు డ్రాయింగు రూములో ఉంటే మామగారు వెళ్ళి ఏమిటి నాయనా అని అడిగారు. తనకేదో మునిగిపోయే అవసరం వచ్చిందని పైకం కావలెనని అన్నాడట. 'నీ అవసం నాతో చెప్పాలి గాని చిన్న పిల్లను బాధించటం ఎందుకు' అంటూ తన కూతురు సుఖముకై పైకం తెచ్చి ఆ రాత్రే యిచ్చారు. ఆ రాత్రి యెల్లాగోగడిపి, తెల్లవారకముందే వెళ్ళిపోయాడు. ఆ నాటినుండి ఈ నాటివరకు రాలేదు. అందరితో యిదే ప్రచారం. మొన్న పద్మకు ఒక జాబు వ్రాశాడు పిచ్చగా.

''నీ తల్లి నీవు కులటలు, వ్యభిచారులు. నీ తండ్రిచేత 50 వేలు యిప్పించు, లేదా నాకు డైవర్సుఇయ్యి'' అని. ఈ రెండే ముక్కలు ఆ జాబులో. ఈ డబ్బు పిచ్చకు అంతే లేదాయె. పదివేలు కట్నమిచ్చినదిచాలక తాను అడిగినప్పుడల్లా వేలు ఎచటనుండి తేగలమక్కా ?'' ''బావగారి మెత్తదనం కనిపెట్టినాడా బుద్ధిమంతుడు! మొదలే అవకాశం ఇవ్వగూడదిట్టి మూర్ఖులకు. కాలంమారి ఘనమైన విద్యాబుద్ధులునేర్చి స్వాతంత్ర్యం, స్వాతంత్ర్యం అనిచాటే ఈ దినాలలో ఇంకా ఇట్టి అవినీతిగల స్త్రీ పురుషులున్నా

రంటే ఏంచెప్పాలి? అవథానిగారి అరుంధతి అసలే లేచివచ్చింది, అత్తవారింటి నుండి. చక్కని కాపురం. ఆరూపోరూ లేదు. తను భర్త ఇద్దరే. తన చుట్టాలను భర్త పలుకరించలేదట. భర్తవేపు బంధువులు ఇంటికివస్తే తాను పలుకదట. అదేమీ అని భర్త అంటే భరించలేక వచ్చేసిందట. పోనీ ఆ పిల్ల వచ్చిందనుకో. తల్లి దండ్రులు ఆమోదించి ఇంట్లో అట్టిపెట్టుకొనటమా. పైగా పైపెచ్చు పదిమందిగలిసి వారి యింటిపైకివెళ్ళి నానా మాటలు అని వచ్చారట. అరుంధతి ఆ యింటికైన ఆడది. కాపురానికివచ్చి బిడ్డలనుకని పరులకై కీచులాడుకొని పండంటి కాపురం పాడుచేసుకొనే ఆ స్త్రీ తెలివికై చింతించుచున్నాను. గృహస్థ ధర్మమే తెలియకపోయెను. అది సనాతనమైనప్పటికి ఈ నవీనకాలంలో ప్రేమ అనుకొనే ఆ ప్రేమ. ప్రేమలక్షణమైనా తెలియదాయె. వివాహమనే అనుబంధం స్త్రీ పురుషులకు ఏర్పడిన తరువాత 'అర్థే చధనే చవామే చనాతి చరామి' అనే ధర్మాన్ని అనుసరించుకొని పురుషుడు ప్రేమించాలి. 'కార్యేషుదాసి, కరణేశు మంత్రి' అనే ధర్మయుక్తమైన ప్రేమతో భర్తకు అనుగుణ్యంగా భార్య నడుచుకొనుటలోయున్న నేర్పు, ఓర్పు ఎంత గొప్పది, ఎంత కీర్తి, ఎంత సుఖము ఉన్నదో ఎరుగరాయె. స్త్రీ స్వాతంత్ర్యం ఏర్పడి స్త్రీలుగూడ పురుషులతో సమానంగా విద్యాబుద్ధులునేర్చి స్వతంత్ర జీవనం చేయుట, లోకం ఇంకా తెలుసుకోలేదా? పల్లెటూళ్లన్నీ ఎంతో బాగుపడి స్త్రీ విద్య ప్రచారంలో ఉన్న దినాలు యివి. నాగుజెముడు పురుగును నాశనంచేసినట్లు స్త్రీ అజ్ఞానాన్ని నాశనంచేసింది ఆంధ్ర మహిళా సంస్థ. కాని స్త్రీ తన విజ్ఞానంతో తాను కుటుంబభారం వహించి పుట్టింటికి, అత్తింటికీ కీర్తి గడించుట ధర్మమని ఇంకా మూర్ఖచిత్తులు కొంతమంది తెలిసికొనలేదు. తన ధర్మమును తాను రక్షించుకొనుటే జన్మజడకుండుటకు కారణము అనిగూడా ఎరుగరు. ఇంక పురుషుడు తన భార్యను ఎట్లా ప్రేమించవలెనో, ఎట్లా గౌరవించవలెనో, తన తలి తన యింటికి ఒకప్పుడు ఎల్లా స్వతంత్రించిందో, తమతోబుట్టువులు వెళ్లినచోట సుఖించుట ఎట్లా కోరుకొనుచున్నారో భార్య తన యింటికి అట్టి సుఖమునకే వచ్చినదని తెలిసికొనుట లేదు కొంతమంది యువకులు. 'చిన్న నా పొట్టకు శ్రీరామరక్ష' అని ఈ స్వార్థానికి అంతుకనుపించుటలేదు. దైవర్సు యిమ్మని అడిగే పద్మ భర్త పెళ్లెందుకు చేసుకొన్నాడు? ఏమి తెలియని చిన్నతనమా? పురుషులలోనే ఇంకాఇంత అవినీతి ఉన్నదంటే యింక స్త్రీలమాట ఏమిచెప్పాలి? అక్కా చాల రాత్రి అయింది. తరువాత ఆలోచిద్దాము పద్మ విషయము. నేను వెళ్ళివస్తాను.''